
మెయిన్
# టీ-మీడియా
సామాజికం.. ప్రజల పక్షం...
సంపుటి : 8
సంచిక : 224
పేజీలు : 3
శనివారం 14.03.2026
GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in
ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

జర్నలిజం ఉచిత శిక్షణ
టీ మీడియా (తెలుగు మీడియా) డిజిటల్ ఆధ్వర్యంలో జర్నలిజం వృత్తి శిక్షణ తరగతులు వారం (07) రోజులు పాటు రోజుకు గంట ఖమ్మంలో నిర్వహించబడును.
కనీస విద్యార్హత ఇంటర్ :
ఆసక్తి ఉన్నవారు తమ బయోడేటా 8919710365 కి వాట్సాప్ చేయగలరు.
నోట్ ఎటువంటి ఫోన్ చేయవద్దు. శిక్షణ స్థలం, తేదీ తరువాత తెలియజేస్తాము.
ఇట్లు టీ మీడియా కుటుంబం

# హద్దులు దాటుతున్న రేషన్ బియ్యం
# పక్క రాష్ట్రాలకు రవాణా..?




## వేలం పత్రాలే అనుమతులుగా..

**టి మీడియా, మార్చి 13,హైదరాబాద్ బ్యూరో :** తెలంగాణ రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీతో కొంతమంది దందా శృతిమించుతోంది. ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకున్నప్పటికీ, కొందరు డీలర్లు రైస్ మిల్లర్లు కలిసి అక్రమ దందాను కొనసాగిస్తున్నారని అందుకు అధికారులంతా సంపూర్ణ సహకారం అందిస్తు న్నారని విమర్శలు వ్యక్తమవు తున్నాయి. రేషన్ షాపుల నుంచి లబ్ధిదారులకు బియ్యం ఇవ్వకుండా కొందరు డీలర్లు కిలోకు రూ.15, 20 చొప్పున నగదు చెల్లించి బియ్యాన్ని తిరిగి సేకరిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రేషన్ బియ్యం మాఫియా సామ్రాజ్యం రోజురోజుకు విస్తరిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని కొందరు మాఫియా సభ్యులు తక్కువ ధరకు కొనుగోలు చేసి పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నట్టు సమాచారం. రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు సేకరించి, అధిక ధరలకు విక్రయించడం ద్వారా వ్యాపారులు భారీ లాభాలు ఆర్జిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ అక్రమ వ్యాపారానికి రైస్ మిల్లు వ్యాపారులే ప్రధాన సూత్రధారులుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.మరోవైపు పౌరసరఫరాలు, రెవెన్యూ, పోలీస్, టాస్క్‌ఫోర్స్ శాఖల కొందరు అధికారులకు ప్రతినెల మామూలు చెల్లిస్తూ మాఫియా వ్యాపారం నిరభ్యంతరంగా కొనసాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మెదక్, రామాయంపేట, తూప్రాన్, నర్సాపూర్, పెద్దశంకరంపేట, అల్లాదుర్గం, పాపన్నపేట్, హవేలీ ఘనాపూర్ తదితర మండలాల్లో రేషన్ బియ్యాన్ని గుట్టుగా నిల్వచేసి, తరువాత ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నట్టు సమాచారం.





### పక్క రాష్ట్రాలకు రవాణా..?

పేదలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని కొందరు డీలర్లు, మధ్యవర్తులు తక్కువ ధరలకు కొనుగోలు చేసి ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. పేదల నుంచి సేకరించిన బియ్యాన్ని గ్రామాల పరిసరాల్లోని షెడ్డులు, వ్యవసాయ క్షేత్రాల్లో నిల్వ చేసి, అనంతరం లారీలు, డీసీఎంల ద్వారా తరలిస్తున్నట్టు సమాచారం.మెదక్ జిల్లాలో సేకరించిన బియ్యాన్ని ప్రధానంగా కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలకు తరలిస్తున్నట్టు తెలిసింది. పేదల బియ్యాన్ని రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నా సంబంధిత అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికార పార్టీకి చెందిన కొందరు నాయకుల అండదండలు ఉండటంతో మాఫియా నిర్భయంగా వ్యవహరిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.తెలంగాణ వార్తలు

### వేలం పత్రాలే అనుమతులుగా

అధికారులు దాడులు చేసి పట్టుకున్న రేషన్ బియ్యాన్ని కొంతకాలం తర్వాత సివిల్ సప్లై శాఖ అధికారులు బహిరంగ వేలంలో విక్రయిస్తారు. ఈ వేలంలో అదే మాఫియా వర్గాలు బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. వేలంలో కొనుగోలు చేసిన సమయంలో ఇచ్చే అనుమతి పత్రాన్ని అడ్డుపెట్టుకుని, అదే పత్రంతో నెలల తరబడి అక్రమంగా రేషన్ బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నట్టు సమాచారం.వేలంలో కొనుగోలు చేసిన బియ్యాన్ని గోదాం నుంచి తరలించడానికి మాత్రమే ఇచ్చే పత్రాలు, మాఫియా చేతుల్లో అక్రమ రవాణాకు మార్గంగా మారిపోయాయని స్థానికులు అంటున్నారు. ఈ విధంగా లారీలు, డీసీఎంలలో పెద్ద ఎత్తున రేషన్ బియ్యాన్ని పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నట్టు తెలుస్తోంది.

### నాగర్కర్నూల్ జిల్లాలో

నాగర్కర్నూల్ జిల్లాలో ప్రతి నెల సుమారు 5,000 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం సరఫరా అవుతోంది. జిల్లాలో మొత్తం 2,75,900కు పైగా రేషన్ కార్డులు ఉండగా, సుమారు 8 లక్షల 87 వేల 311 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి 552 రేషన్ దుకాణాల ద్వారా బియ్యం పంపిణీ జరుగుతోంది. అయితే ఈ బియ్యంలో సగం కూడా లబ్ధిదారుల ఇళ్లకు చేరడం లేదని ఆ రోపణలు వినిపిస్తున్నాయి.ప్రధానంగా కల్వకుర్తి ప్రాంతంలో దశాబ్దాలుగా బియ్యం వ్యా పారంలో ఉన్న కొందరు మిల్లులు నడిపిస్తూ ఈ అక్రమ దందాను గుట్టుచప్పుడు కాకుం డా కొనసాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అధికారులు అప్పుడప్పుడు తనిఖీలు చేస్తున్నప్పటికీ పెద్దగా చర్యలు లేకపోవడంతో అక్రమ వ్యాపారం అధికారుల అండ తోనే జోరుగా సాగుతుందన్న వాదన వినిపిస్తోంది. ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సన్న బియ్యం పంపిణీ చేయాలన్న లక్ష్యానికి తూట్లు పడుతోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# దేశంలో గ్యాస్ కొరత లేదు: కేంద్రం

- ఎల్‌పీజీ పై స్పందించిన కేంద్రం

**టి మీడియా, మార్చి 13,ఢిల్లీ బ్యూరో :**




దేశంలో గ్యాస్ కొరత లేదని కేంద్రం మరోసారి స్పష్టం చేసింది. వంటగ్యాస్ సిలిండర్ల కొరతపై జరుగుతోన్న ప్రచారాలపై స్పందించిన కేంద్రం గ్యాస్ గురించి ప్రజలు ఆందోళన చెందొద్దని వెల్లడించింది. గ్యాస్ కోసం క్యూలో నిలబడాల్సిన అవసరం లేదని మీడియా సమావేశంలో కేంద్ర చమురు మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాతా శర్మ చెప్పారు. అవసరం లేకపోయినా ఆందోళనతో గ్యాస్ బుకింగ్‌లు చేయవద్దని మరోసారి విజ్ఞప్తి చేశారు.మార్చి 5తో పోలిస్తే దేశీయ ఉత్పత్తి 30 శాతం పెరిగినట్లు సుజాతా శర్మ వెల్లడించారు. మిడిల్ ఈస్ట్ యుద్ధం ప్రారంభం కావడానికి ముందు ప్రతిరోజు 55.7 లక్షల ఎల్‌పీజీ బుకింగ్స్ జరిగేవని, ఇప్పుడు వాటి సంఖ్య ఏకంగా 75.7 లక్షలు దాటిందన్నారు. ప్రజలు భయాందోళనతోనే భారీ బుకింగ్స్ చేస్తున్నారని ఈ గణాంకాలతో స్పష్టమవుతోందని ఆమె చెప్పారు. ఇంతగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, దేశంలోని ఏ ఎల్‌పీజీ డీలర్ దగ్గర కూడా గ్యాస్ స్టాక్ పూర్తిగా అయిపోలేదని సుజాత శర్మ పేర్కొన్నారు.భారత్‌కు చెందిన నౌకలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. హోర్ముజ్ జలసంధి వద్ద నౌకల్లో ఉన్న వారి భద్రత కోసం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నౌకల్లో ఉన్న 23 వేల మంది భారతీయుల భద్రత కోసం 24 గంటల కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. భారత్‌లోని పోర్టుల్లో కార్యకలాపాలు సాధారణంగానే ఉన్నాయన్నారు. రాష్ట్రాలతో సమన్వయం చేసుకుంటూ వెళ్తున్నామన్నారు.

# రైతుల అకౌంట్లోకి రూ.6 వేలు

## అన్నదాత సుఖీభవ డబ్బులు రిలీజ్.

**టీ మీడియా, మార్చి 13, గన్నవరం:**ఏపీ రైతులకు చంద్రబాబు సర్కార్ భారీ శుభవార్త అందించింది. అన్నదాత సుఖీభవ నిధులను విడుదల చేసింది. కృష్ణాజిల్లా గన్నవరం మండలం సూరంపల్లిలో జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొని స్వయంగా తన చేతుల మీదుగా నిధులు విడుదల చేశారు. దీంతో ఏపీలోని రైతులకు ఒక్కొక్కరికీ రూ. 6 వేలు జమ అయ్యాయి. కొద్దిసేపటి క్రితం అస్సాంలోని గువహతిలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ పీఎం కిసాన్ నిధులను విడుదల చేశారు. దీంతో ఏపీలోని పీఎం కిసాన్ లబ్దిదారులకు రూ.2 వేలు కేంద్రం నుంచి జమ కాగా.. అన్నదాత సుఖీభవ పథకం ఏపీ ప్రభుత్వం రూ.4 వేలు జమ చేసింది. దీంతో ఏపీలోని రైతుల అకౌంట్లలో ఒకేసారి రూ.6 వేలు జమ అయ్యాయి.





### ఏపీ రైతుల అకౌంట్లో రూ.6 వేలు జమ

అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకం కింద ఇవాళ 46.85 లక్షల రైతు కుటుంబాలకు మొత్తం రూ.2,676 కోట్లు ఏపీ ప్రభుత్వం విడుదల చేసింది. వీటిల్లో ఏపీ ప్రభుత్వం వాటా రూ.1,874 కోట్లు ఉండగా.. కేంద్ర వాటా రూ.802 కోట్లుగా ఉంది. ఇప్పటివరకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఏపీ ప్రభుత్వం మొదటి, రెండో విడత కలిపి ఒక్కో రైతుకు రూ.14వేలు అందించింది. ఇప్పుడు మూడో విడతతో కలిపి ఒక్కో రైతుకు మొత్తం రూ.20వేలు అందించింది. ఎన్నికలకు ముందు అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి రూ.20 వేలు అందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆ హామీ మేరకు ఏపీ ప్రభుత్వం ఏడాదికి రూ.14 వేలు ఇస్తోండగా.. పీఎం కిసాన్ కింద రూ.6 వేలు అందుతున్నాయి. రైతులకు పెట్టుబడి సాయం కింద ఇది ఉపయోగపడుతుంది.

### పీఎం కిసాన్ రోజే..

పీఎం కిసాన్ పథకంతో కలిసే అన్నదాత సుఖీభవ పథకాన్ని ఏపీ ప్రభుత్వం అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది. దీంతో పీఎం కిసాన్ కేంద్రం రిలీజ్ చేసే రోజు అన్నదాత సుఖీభవ డబ్బులను ఏపీ ప్రభుత్వం రిలీజ్ చేసింది. దీంతో రైతులకు రెండు రకాలుగా లబ్ధి చేకూరుతుంది. రైతులు వీటిని తమ ఖర్చుల కోసం ఉపయోగించుకోవచ్చు. అన్నదాత సుఖీభవ పథకం కోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో రైతులు దరఖాస్తు చేసుకోవచ్చు. అధికారులు పరిశీలించి లబ్దిదారుల జాబితాలో చేరుస్తారు. ఇక అన్నదాత సుఖీభవ వెబ్ సైట్లోకి వెళ్లి మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చు. అలాగే మీకు డబ్బులు పడ్డాయా.. లేదా అనే స్టేటస్ కూడా ఆ వెబ్ సైట్‌లో చూసుకునే అవకాశాన్ని ఏపీ ప్రభుత్వం కల్పిస్తోంది



# ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌పై దాడి

- గుర్తుపట్టలేని విధంగా మారిన ముజ్తబా

**టి మీడియా, మార్చి 13,ఢిల్లీ బ్యూరో :** ఇరాన్ నూతన సుప్రీం లీడర్ అయతుల్లా ముజ్తబా ఖమేనీపై అమెరికా రక్షణ శాఖ కీలక ప్రకటన చేసింది. తమ దాడిలో ఆయన తీవ్రంగా గాయపడ్డారని వెల్లడించింది. దీంతో ముజ్తబా ఖమేనీ గుర్తుపట్టలేని విధంగా మారారని తెలిపింది. అమెరికాపై ప్రతీకారం తీర్చుకుంటామని ముజ్తబా ఖమేనీ గురువారం తొలిసారి ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆయనపై దాడి చేశామంటూ అమెరికా రక్షణ శాఖ విడుదల చేసిన ప్రకటన ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

మిగతా 3లో..

# కొత్త పార్టీ పేరును ప్రకటించిన శశికళ

**టి మీడియా, మార్చి 13,చెన్నై:**




తమిళనాడు దివంగత మాజీ సీఎం జయలలిత సన్నిహితురాలు, అన్నాడీఎంకే మాజీ జనరల్ సెక్రటరీ వీకే శశికళ. కొత్త పార్టీని స్థాపించారు. ఆ పార్టీకి ఆల్ ఇండియా పురచ్చి తలైవార్ మక్కల్ మున్నేత్ర కజగం అని నామకరం చేశారు. ఏఐపీటీఎంఎంకే పేరును ఇవాళ ఆమె వెల్లడించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 24వ తేదీన రామనాథపురం జిల్లాలోని కాముతి లో జరిగిన సమావేశంలో పార్టీ జెండాను శశికళ ఆవిష్కరించిన విషయం తెలిసిందే. కొబ్బరిచెట్ల ఫార్మ్‌ను పార్టీ బొమ్మగా ప్రకటించారు.ప్రస్తుతం శశికళ వయసు 71 ఏళ్లు. త్వరలో తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. తమ పార్టీ సింబల్ ఐక్యతకు సంకేతం అని ఆమె అన్నారు. తమ పార్టీ ఓ ఉమ్మడి కుటుంబం తరహాలో పనిచేస్తుందన్నారు. తమిళనాడు, పుదుచ్చరిలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు పోటీచేయనున్నట్లు ఆమె చెప్పారు. మన నాయకుడు ఎంజీ రామచంద్రన్ ఎదుర్కొన్న దశలోనే తాను కూడా ఉన్నానని, క్యాడర్ ప్రారంభించిన పార్టీలోనే ఆయన చేరారని ఆమె అన్నారు. తమ పార్టీ జెండాలో నలుపు, తెలుపు, ఎరుపు రంగులు ఉన్నాయన్నారు. ఆ జెండాలో మాజీ సీఎంలు సీఎన్ అన్నాదురై, ఎంజీ రామచంద్రన్, జయలలిత ఫోటోలు కూడా ఉన్నాయి.

# భారీ జీఎస్టీ కుంభకోణం

## రూ.84 కోట్లు కొట్టేసిన ముఠా గుట్టురట్టు

**టీ మీడియా, మార్చి 13, హైదరాబాద్ బ్యూరో :**తెలంగాణలో భారీ జీఎస్టీ కుంభకోణాన్ని వాణిజ్య పన్నుల శాఖ అధికారులు ఛేదించారు. నకిలీ ఇన్వాయిస్‌లతో ప్రభుత్వ ఖజానాకు కన్నం వేస్తున్న ముఠా గుట్టురట్టు చేశారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. తెలంగాణ కమర్షియల్ ట్యాక్సెస్ శాఖ రాష్ట్రంలో జరుగుతున్న భారీ పన్నుల దోపిడీని వెలుగులోకి తెచ్చింది. ఫేక్ ఇన్వాయిస్‌లు సృష్టించి, అసలు సరుకు సరఫరా చేయకుండానే దాదాపు రూ.84.15 కోట్ల మేర ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందిన భారీ మోసాన్ని అధికారులు కనిపెట్టారు. ఈ అక్రమాలకు ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న ఎస్‌కేజీ ట్రేడింగ్ కంపెనీ యజమాని సందీప్ కుమార్ గోయల్‌ను అధికారులు అరెస్ట్ చేశారు

### అసలు మోసం జరిగిందిలా.

వాణిజ్య పన్నుల శాఖ నిర్వహించిన విచారణలో దిగ్భ్రాంతికరమైన విషయాలు బయటపడ్డాయి. సందీప్ కుమార్ తన ఎస్‌కేజీ ట్రేడింగ్ కంపెనీ ద్వారా ఎలాంటి వస్తువులను విక్రయించకుండానే.. కేవలం కాగితాల మీద ఇన్వాయిసులు సృష్టించి కోట్లాది రూపాయల ఐటీసీని క్లెయిమ్ చేసినట్లు అధికారులు నిర్ధారించారు. ఇతను కేవలం ఒక్క కంపెనీకే పరిమితం కాకుం వంటి ఇతర సంస్థల పేర్లతో కూడా ఇదే తరహా అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు .ఈ మోసం బయటపడటంతో అధికారులు తక్షణమే రంగంలోకి దిగారు. అక్రమాలకు పాల్పడిన రెండు సంస్థల జీఎస్టీ రిజిస్ట్రేషన్లను రద్దు చేశారు. నిందితుడు సందీప్ కుమార్‌పై తెలంగాణ +టూ చట్టం-2017 కింద కేసు నమోదు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా.. న్యాయమూర్తి అతనికి జ్యుడీషియల్ కస్టడీ విధించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే ఇలాంటి నకిలీ ఐటీసీ క్లెయిమ్‌లపై ఉక్కుపాదం మోపుతామని వాణిజ్య పన్నుల శాఖ హెచ్చరించింది. ఎస్‌కేజీ ట్రేడింగ్ కంపెనీ లావాదేవీలపై మరింత లోతైన దర్యాప్తు జరుపుతున్నామని.. ఈ గొలుసుకట్టు మోసంలో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందనే కోణంలో విచారణ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించే వారిపై నిరంతర నిఘా ఉంటుందని స్పష్టం చేశారు



# హోటల్ యాజమాన్యాలు అడ్డదారులు

- షాకిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం

**టి మీడియా, మార్చి 13,నిజామాబాద్:**
తెలంగాణ వ్యాప్తంగా హోటళ్లు, రెస్టారెంట్లకు వాణిజ్య సిలిండర్ల సరఫరాను నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో ఒక్కసారిగా సమస్యలు తలెత్తాయి. చేసేదేంలేక హోటల్? యాజమాన్యాలు చాలా వరకు పక్కదారులు తొక్కాయి. వాణిజ్య సిలిండర్లు లభించకపోవడంతో వారంతా డొమెస్టిక్? సిలిండర్లను వాడటం ప్రారంభించారు. ఈ విషయం అధికారులకు తెలియడంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వివరాల్లోకి వెళితే,

**హోటళ్లలో డొమెస్టిక్ గ్యాస్? సిలిండర్లు**
నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలో హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, బార్ అండ్ రెస్టారెంట్లపై ఎన్?ఫోర్స్?మెంట్? అధికారుల ఆకస్మిక దాడులు నిర్వహించారు. సాధారణ ప్రజలు ఇంటి అవసరాలకు డొమెస్టిక్? గ్యాస్? సిలిండర్లను వినియోగిస్తారు. అయితే వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్నారని వచ్చిన సమాచారంతో అధికారులు ఈ తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆర్మూర్ పట్టణంలోని పలు హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, బార్ అండ్ రెస్టారెంట్లలో ఎన్?ఫోర్స్?మెంట్? అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.

**తనిఖీల్లో డొమెస్టిక్ సిలిండర్లు స్వాధీనం**
వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను ఉపయోగిస్తున్నారని వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఈ దాడులు



చేపట్టినట్లు అధికారులు తెలిపారు. తనిఖీల సమయంలో హోటళ్లలో సుమారు 50 డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాణిజ్య వినియోగానికి కేవలం కమర్షియల్ గ్యాస్ సిలిండర్లనే ఉపయోగించాలని అధికారులు స్పష్టం చేశారు. డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని హోటల్ యాజమాన్యాలకు ఎన్?ఫోర్స్?మెంట్? అధికారులు హెచ్చరించారు. నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని దీపక్ స్వీట్ హోమ్?పై సివిల్ సప్లయ్ అధికారుల దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా వాడుతున్న 15 గృహ వినియోగ (డొమాస్టిక్) సిలిండర్లను అధికారులు సీజ్ చేశారు. యుద్ధం నేపథ్యంలో గ్యాస్ దొరుకుతుందా లేదా అని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. హోటళ్లలో గృహ వినియోగానికి వాడే గ్యాస్ బండలను స్వాధీనం చేసుకుంటున్నారు.

**వంట గ్యాస్?కు కొరత లేదు**
వంట గ్యాస్ కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. బ్లాక్ మార్కెట్ చేసినా గృహ వినియోగదారులకు ఏవిధంగా అసౌకర్యం కలిగించినా ఉపేక్షించేది లేదని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో వంట గ్యాస్?కు కొరత లేదని ప్రజలు ఆందోళన పడవద్దని ఆయన తెలిపారు.

**అధికారులతో వీడియో కాన్ఫరెన్స్**
వంట గ్యాస్, వేసవిలో నీటి ఎద్దడి, 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికపై కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గృహ వినియోగదారులకు సరిపోయేంత గ్యాస్?ను సరఫరా చేస్తామని ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఆసుపత్రులు, ప్రభుత్వ హాస్టళ్లకు సరిపడా గ్యాస్ సరఫరా చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీఎస్ రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షలకు కట్టుదిట్టమైన పోలీసు భద్రత

- జిల్లా ఎస్పీ సునిత రెడ్డి

**టీ మీడియా, మార్చి 13, వనపర్తి బ్యూరో :**
విద్యార్థులు ఎటువంటి భయం లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా జిల్లాలోని అన్ని పదవ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ సునిత రెడ్డి తెలిపారు. వనపర్తి జిల్లాలో నిర్వహించనున్న పదవ తరగతి వార్షిక పరీక్షలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసుశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతలు పరిరక్షించేందుకు బిఎన్ఎస్ఎస్ -2023 సెక్షన్ 163 (144 సెక్షన్) అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. వనపర్తి జిల్లాలో 37 పరీక్షా కేంద్రాలలో మొత్తం 7,212 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటం నిషేధం. ఈ ఆంక్షలు 14 మార్చి 2026 నుండి 16 ఏప్రిల్ 2026 వరకు అమల్లో ఉంటాయి. ప్రతి పరీక్షా రోజు ఉదయం 07:00 గంటల నుండి మధ్యాహ్నం 03:00 గంటల వరకు సెక్షన్ 163 అమల్లో ఉంటుందని తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఉన్న జిరాక్స్ సెంటర్లు పరీక్షల సమయంలో తప్పనిసరిగా మూసివేయాలని ఎస్పీ ఆదేశించారు. జిల్లాలోని అన్ని పోలీస్టేషన్ అధికారులకు పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులు ఎలక్ట్రానిక్ వాచీలు లేదా ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రాల్లోకి తీసుకురావద్దని సూచించారు. పరీక్షల సమయంలో ఇన్విజిలేటర్లు మరియు పోలీస్ సిబ్బంది మొబైల్ ఫోన్ల వినియోగాన్ని కూడా నిషేధించారు. ఈ ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. విద్యార్థులు ఎటువంటి ఆందోళన లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా జిల్లా పోలీస్ శాఖ సంపూర్ణ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పరీక్షల పారదర్శకతను కాపాడేందుకు ప్రజలు తల్లిదండ్రులు పోలీసుశాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు.



## మాజీ డీజీపీ హెచ్ జే దొర కన్నుమూత

**టి మీడియా, మార్చి 13,హైదరాబాద్ :**
ఉమ్మడి ఏపీ మాజీ డీజీపీ హెచ్ జే దొర నిమ్స్ లో చికిత్స పొందుతూ కన్ను మూశారు. కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధి తో బాధ పడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఉదయం తీవ్ర అస్వస్థతకు గురికావడం తో నిమ్స్ ఏఆర్‌సీయూ చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు1965 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన దొర ఉమ్మడి ఏపీలో మొదట అడిషనల్ డీజీపీగా అనంతరం డీజీపీగా పనిచేశారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన దొర 1993లో పీపుల్స్‌వార్ గ్రూప్ లక్ష్యంగా చేసుకున్న 40 మంది కీలక పోలీసు అధికారుల జాబితాలో ఆయన పేరుకూడా ఉంది. 2002లో కేంద్ర సర్వీసులకు వెళ్లిన దొర ఢిల్లీలో సెంట్రల్ ఇండస్ట్రీయల్ సెక్యూరిటీ ఫోర్స్ డీజీపీగా బాధ్యతలు నిర్వహించారు. భారత విజిలెన్స్ కమిషనర్‌గా ఆయన సేవలందించారు. ఆయన భౌతిక కాయానికి తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి, హైదరాబాద్ సిటీ కమిషనర్ విసి సజ్జనర్ , మాజీ పోలీసు అధికారులు నివాళి అర్పించారు.



## పెట్రోల్ కొరతతో బంకుల వద్ద వాహనదారులు క్యూ

**టి మీడియా, మార్చి 13,కుమ్రం భీం ఆసిఫాబాద్:**
జిల్లా కేంద్రంలోని కొన్ని పెట్రోల్ బంకుల్లో "నో స్టాక్" బోర్డులు కనిపించడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని పలు బంకుల్లో పెట్రోల్ నిల్వలు లేకపోవడంతో, జనకపూర్ ప్రాంతంలోని ఒక పెట్రోల్ బంక్‌లో మాత్రమే ఇంధనం అందుబాటులో ఉండటంతో అక్కడ భారీగా వాహనాల రద్దీ కనిపిస్తోంది. పెట్రోల్ కోసం ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు గంటల తరబడి క్యూ లైన్‌లో నిలబడి వేచి చూడాల్సి వస్తోందని వాహనదారులు తెలిపారు. పెట్రోల్ కొరత కారణంగా ఉదయం నుంచి బంక్ వద్ద పెద్ద ఎత్తున క్యూలు ఏర్పడి ట్రాఫిక్‌కు కూడా అంతరాయం కలుగుతోంది. కొంతమంది వాహనదారులు అవసరమైన పనులకు వెళ్లడంలో ఆలస్యం అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్రోల్ సరఫరా సాధారణ స్థితికి రావడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇంధన సరఫరాలో అంతరాయం రావడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని సమాచారం. త్వరలోనే సరఫరా పునరుద్ధరించబడుతుందని బంక్ నిర్వాహకులు తెలిపారు.



## యాదవ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శ్రీకారం

**టి మీడియా, మార్చి 13,సుల్తానాబాద్:**
పెద్దపల్లి ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో యాదవ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 10 లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు అవార్డు కౌన్సిలర్ వర ప్రదీప్ తెలిపారు. ఈ సందర్భంగా 7వ వార్డు కౌన్సిలర్ ఉట్లా వరప్రదీప్ ఆధ్వర్యంలో శుక్రవారం యాదవ సంఘం కుల పెద్దలతో పాటు సంబంధిత ఏఈతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సంబంధించిన బిల్డింగ్ అంచనాలు, నిర్మాణ విధానం, స్థల పరిశీలన తదితర అంశాలపై సవివరంగా చర్చించారు. త్వరలోనే పనులు ప్రారంభించి యాదవ కమ్యూనిటీకి ఉపయోగపడే విధంగా హాల్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఉట్లా వరప్రదీప్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు కావడం ఆనందకరమని తెలిపారు. ఈ హాల్ ద్వారా యాదవ సంఘానికి చెందిన ప్రజలు వివిధ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు సౌకర్యం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం కుల పెద్దలు, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



## స్వయం పరిపాలన దినోత్సవం

**టీ మీడియా మార్చి 13పెబ్బేరు**
శుక్రవారం పెబ్బేరు మండలంలోని పాతపల్లి గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మయ్య ఆధ్వర్యంలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ చైతన్య భారతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు పాఠశాల బిల్డింగ్ శిథిలావస్థకు చేరుకుని వర్షపు నీరు కురుస్తుందని తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టాలని నూతన భవన నిర్మాణం చేయడానికి కృషి చేయాలని అధ్యాపక బృందం సర్పంచ్ విన్నవించారు అనంతరం ఆమె మాట్లాడుతూ పాఠశాల నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తక్షణమే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు విద్యార్థులు విద్య పై పట్టు సాధించాలని సాంకేతిక విద్యా విధానాలు అలవర్చుకోవాలని పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను నిర్వహించాలని ఉపాధ్యాయులను కోరారు ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తూ తోటి విద్యార్థులకు విద్యను బోధించారు హెచ్‌ఎంగా ఉమారాణి మాథ్స్ టీచర్ గా జాహ్నవి వంశీ నాయుడు ఇంగ్లీష్ టీచర్ గా ఉమారాణి మహేష్ ఈ వీ ఎస్ టీచర్ గా సమంత పిటి టీచర్ గా ఆంజనేయులు అటెండర్ గా భాను ప్రకాష్ తో పాటు మరో పదిమంది విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీలు కృష్ణవేణి జానకి జ్యోతి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## సేవ చేసే భాగ్యాన్ని సద్వినియోగం చేసుకోండి

**ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికపై అవగాహన**

**టీ మీడియా, మార్చి 13,హనుమకొండ:** జిల్లా అభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక"గ్రాత్మీయి 99 రోజుల కార్యాచరణపై గ్రామీణ, పట్టణ ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించే కార్యక్రమం హనుమకొండ జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. ఈ అవగాహన సదస్సును వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి , నగర మేయర్ గుండు సుధారాణి , జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రభుత్వం రూపొందించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూర్చేలా రూపొందించబడిందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా అమలు చేయడం ఈ కార్యాచరణ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, అదనపు కలెక్టర్ రవి, డీఆర్‌డీఏ అధికారి మేన శ్రీను, ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు కార్పొరేటర్ మానస రాంప్రసాద్, జక్కుల రవీందర్,విజయశ్రీ రజాలి,మామిండ్ల రాజు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



# వంట చెరుకుకు డిమాండ్

- తెల్లవారుజాము నుంచే కట్టెల మండీ వద్ద క్యూ

**టి మీడియా, మార్చి 13,హైదరాబాద్? :**
పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా వాణిజ్య గ్యాస్? సిలిండర్ల కొరతతో హైదరాబాద్? నగరంలో కట్టెలకు ఫుల్ డిమాండ్ పెరిగింది. మూడు రోజుల కిందట క్వింటాల్? రూ.1200 ఉన్న వంట చెరుకు, ఇప్పుడు రెట్టింపు ధరలు పలుకుతున్నాయి. అసలే పెళ్లిళ్ల సీజన్? కావడంతో పలు ఫంక్షన్ ?హాళ్లు, హాస్టల్?, రెస్టారెంట్ల నిర్వాహకులు పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. సిలిండర్ల సరఫరా తగ్గడంతో ముఖ్యంగా హోటళ్ల వ్యాపారంపై ప్రభావం పడుతోంది.

**వంట చెరుకుకు పెరుగుతున్న డిమాండ్**
ప్రస్థుత పరిస్థితుల్లో వంట చెరుకుకు డిమాండ్? అధికంగా ఉండటంతో భువనగిరి, ఆలేరు నుంచి పెద్ద ఎత్తున హైదరాబాద్? నగరానికి చేరుకుంటున్నాయి. వాణిజ్య గ్యాస్? కొరతతో రాజధాని నగరంలోని పలు రెస్టారెంట్లు, హోటళ్లు ఇప్పటికే మూతపడ్డాయి. రిస్క్? చేసి నడుపుతున్న వారు గ్యాస్ అందుబాటులో లేకపోవడంతో కట్టెల పొయ్యి పైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో తెల్లవారుజాము 4 గంటల నుంచే ఆయా హోటళ్ల నిర్వాహకులు కట్టెల మండీల వద్ద




క్యూ కడుతున్నారు. ఇంట్లో చేసే చిన్నపాటి ఫంక్షన్లకూ గ్యాస్ కోసం ప్రయత్నిస్తే దొరికే పరిస్థితి లేదని, 30 రోజుల ముందు (ఒక నెల) బుక్ చేయాలని అంటున్నారంటూ వినియోగదారులు వాపోతున్నారు.

**దొరకని గ్యాస్ బండ**
రెండు రోజులుగా రెట్టింపు ధర పలికిన కమర్షియల్ గ్యాస్ సిలిండర్ గురువారం కొనుగోలు చేయాలనుకున్నప్పటికీ సాధ్యం కాలేదని పలువురు వసతిగృహాల యజమానులు వాపోయారు. నో స్టాక్ అంటూ చెప్పారని తెలిపారు. దీంతో ఇక కట్టెల పొయ్యిలే దిక్కయ్యాయని చెబుతున్నారు.

**సిలిండర్ల గురించి ఆలోచించడం లేదు**
ప్రస్తుత వాణిజ్య సిలిండర్ల ధరలకు వసతిగృహం నడపలేమని హాస్టల్ నిర్వాహకులు చెబుతున్నారు. ఉంటున్న వారిని ఇబ్బంది పెట్టలేమని, రోజుకు రూ.150 అద్దెకు కట్టెల పొయ్యి తెచ్చుకుని కట్టెలు సైతం డంప్ చేసుకున్నట్లుగా ఆయన తెలిపారు.

**సిలిండర్ల సరఫరాను ప్రారంభించాలి**
హైదరాబాద్? నగరంలో ఐటీ ఉద్యోగులు ఎక్కువ సంఖ్యలో వసతి పొందుతున్న ప్రైవేటు పీజీ హాస్టళ్లకు కమర్షియల్ గ్యాస్? సిలిండర్ల సరఫరాను వెంటనే పునరుద్ధరించాలని తెలంగాణ రాష్ట్ర ఐటీ కారిడార్? హాస్టల్? అసోసియేషన్? కోరింది. రాయదుర్గంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో అసోసియేషన్? అధ్యక్షుడు అమర్?నాథ్?రెడ్డి, కోశాధికారి మహీందర్, ప్రధాన కార్యదర్శి కరుణాకర్?? తదితరులు మాట్లాడారు. హైదరాబాద్?లోని 11 వేల హాస్టళ్లలో వసతి పొందుతున్న 10 లక్షల మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఒక్కో వసతి గృహం (హాస్టల్?లో) దాదాపు 100 నుంచి 300 మంది వరకు ఉన్నారని, ఒక గ్యాస్ సిలిండర్? రెండు రోజులు వస్తుందని పేర్కొన్నారు.

# ఎల్.పి.జి సిలిండర్లకు ఎలాంటి కొరత లేదు

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**టీ మీడియా, మార్చి 13, వనపర్తి బ్యూరో :**
జిల్లాలోని గృహావసరాలకు, విద్యాలయాలకు, ఆసుపత్రులకు అవసరమైన ఎల్.పి.జి సిలిండర్ల సమస్య లేదని, అవసరమైన మేరకు సరఫరా చేసేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. శుక్రవారం ఎల్.పి.జి సరఫరా, వ్యవసాయ పంటలకు సాగు నీరు, తాగు నీరు, విద్యుత్ కు సంబంధించి రాబోయే రోజుల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు అధ్యక్షతన జిల్లా కలెక్టర్లతో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ఇరిగేషన్, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని సమీక్ష నిర్వహించారు. ఇరాన్ పై యుద్ధం, హర్మూజ్ గుండా రావాల్సిన చమురు నౌకలు ఆగిపోవడం వంటి సమస్యల వల్ల ఎల్.పి.జి సిలిండర్ల కొరత ఏర్పడుతున్న నేపథ్యంలో గృహావసరాలకు, విద్యాలయాలకు, ఆసుపత్రులకు ఎల్.పి.జి సిలెండర్ల సమస్య ఉత్పన్నం కాకుండా చూసుకునేందుకు జిల్లాస్థాయిలో జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన ఎన్ఫోర్స్మెంట్ కమిటీ ఏర్పాటు చేసి సమన్వయంతో పనిచేస్తూ తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి కలెక్టర్లను




సూచించారు. జిల్లాలలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, సిలిండర్ల వినియోగం, సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ తగు చర్యలు తీసుకోవాలని సూచించారు . గృహావసరాలకు వాడే సిలిండర్లు బ్లాక్ మార్కెట్ కు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని, కమర్షియల్ వినియోగాలకు డొమెస్టిక్ సిలిండర్లు వాడకుండా ఎప్పటికప్పుడు పోలీస్ శాఖ ద్వారా తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇరిగేషన్ పై సమీక్షిస్తూ రబీ పంటలు కోతలు పూర్తి అయ్యే వరకు రైతులకు సాగు నీటి సమస్య అదేవిధంగా వేసవిలో ప్రజలకు తాగు నీటి సమస్యలు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సాగు తాగునీటికి సమస్యలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బోరు బావుల పై ఆధారపడిన రైతులకు విద్యుత్ సమస్య రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ రైతులు కేవలం వరి పంట సాగు మాత్రమే చేయకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్ళే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్లను సూచించారు. ముఖ్యంగా పామాయిల్ పంటల సాగు విస్తీర్ణం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ప్రస్తుతం వనపర్తి జిల్లాలో గృహావసరాలకు వినియోగించే ఎల్.పి.జి సిలిండర్ల సమస్య లేదని, గృహావసరాలకు, విద్యాలయాలకు, వైద్య ఆసుపత్రులకు ఎల్.పి.జి సిలిండర్ల సమస్య లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎల్.పి.జి. 15 రోజులకు బదులు 25 రోజులకు సిలిండర్ బుక్ చేసుకునే విధంగా అవకాశం కల్పించడం జరిగింది తప్ప ఎక్కడ సమస్య లేదని తెలిపారు. రబీ సీజన్ కు సంబంధించి త్వరలో కోతలు ప్రారంభం అవుతాయని అప్పటి వరకు సాగు నీటికి ఎక్కడ సమస్యలు లేవన్నారు. తాగు నీటికి సైతం సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కు సంబంధించి ముందస్తుగానే గోదాములు చూసుకోవడం, అవసరం మేరకు గన్ని బ్యాగులు సమకూర్చుకోవడం వంటి వాటిపై దృష్టి సారిస్తామని వెల్లడించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా ఎస్పీ డి సునీత రెడ్డి, ఇరిగేషన్ సి. ఈ . నాగేందర్, ఎస్.ఈ. చంద్రశేఖర్, ఈ. ఈ కేశవ రావు, సివిల్ సప్లై అధికారి కాశి విశ్వనాథ్, ఆర్డీఓ సుబ్రమణ్యం, వ్యవసాయ అధికారి ఆంజనేయులు, హార్టికల్చర్ అధికారి విజయభాస్కర్, ఈ. ఈ మిషన్ భగీరథ యం.డి. అంజాద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

### ప్రజల చైతన్యం ద్వారానే
## మోసాలను అరికట్టవచ్చు

- డీఎస్ఓ కాశీ విశ్వనాథం

**టీ మీడియా, మార్చి 13, వనపర్తి బ్యూరో :**
ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా వనపర్తి జిల్లా కేంద్రంలో వనపర్తి జిల్లా కన్స్యూమర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం రోజు కేజీబీవీ వనపర్తి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో వినియోగదారుల చైతన్య సదస్సు డిఎస్ఓ కాశి విశ్వనాదం అధ్యక్షతన ప్రోగ్రామ్ నిర్వహించడం జరిగింది. చైతన్య సదస్సును ఉద్దేశించి డిఎస్ఓ విశ్వనాధ్ మాట్లాడుతూ మోసాలపై విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని అదేవిధంగా ఒక వస్తువు కొన్నప్పుడు మ్యానుఫ్యాక్చరింగ్ ఎక్స్పైరీ డేట్ లో తప్పనిసరిగా సరిచూసుకోవాలని సూచించడం జరిగింది. విద్యార్థులు విద్యార్థి దశ నుంచే ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించడం జరిగింది. అదేవిధంగా డిఎస్వో కాశి విశ్వనాథం విద్యార్థులకు నోటుబుక్కులు పంపిణీ చేయడం జరిగింది. వనపర్తి జిల్లా కన్స్యూమర్ అధ్యక్షులు బంకల రవీందర్ మాట్లాడుతూ వినియోగదారులు చెల్లించిన ప్రతి రూపాయికి సరియైన ప్రతిఫలం పొందలేక పోతున్నారు, డబ్బులు చెల్లించి సరుకులు కొంటున్నారు, అనేక రకాలైనటువంటి టాక్స్ లను చెల్లిస్తున్నారు, కానీ సరియైన ప్రభుత్వ సేవలు పొందలేకపోతున్నారు. ఆహార పదార్థాలలో అనేక రకాలుగా కల్తీలు విల్లయతాండం చేస్తున్నాయి పాలు, నూనె, నెయ్యి మొదలుకొని విలాస వస్తువులు,అనేకంగా ఉన్నాయి ముఖ్యంగా బండి కోట్లు, మొదలుకొని మిఠాయి షాపులు, హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలు, నిబంధనలకు విరుద్ధంగా నాసిరకం నూనె రసాయనాలు, రంగులు, విరివిగా వినియోగిస్తున్నారు, ఫ్రిజ్జులలో నిల్వ ఉంచిన మాంసము, చేపలు, చికెను వాడుతున్నారు, మార్కెట్లో కూరగాయలు, మాంసము, చాపలు పండ్లు, విక్రయించేవారు తూకంలో మోసాలు చేస్తున్నారు, హాస్పిటల్స్ కి వెళ్తే అనవసరమైన టెస్టులు రాస్తూ వినియోగదారులకు ఆర్థికంగా నష్టం చేకూరుస్తున్నారు, అంతేకాదు డాక్టర్లు జనరిక్ మందులు వ్రాయాలని ప్రభుత్వ ఆదేశాలు మరియు ఈ మధ్యకాలంలోనే సుప్రీంకోర్టు కూడా జనరిక్ మందులు రాయాలని ఆదేశించినప్పటికీ కమిషన్ల కక్కుర్తి పడి కొంతమంది డాక్టర్లు బ్రాండెడ్ మెడిసిన్స్ రాస్తున్నారు అని మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపల్ లోహిత, సునీత మణిమాల, జరీనా బేగం పద్మావతి, మహేంద్ర టీచర్స్ పాల్గొన్నారు.



## ప్రిన్సిపాల్‌తో మున్సిపల్ చైర్మన్ భేటీ


**టీ మీడియా మార్చి 13పెబ్బేరు**
శుక్రవారం వనపర్తి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున్ ను మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు కాలేజీ కార్యాలయానికి చేరుకున్న చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ కు ప్రిన్సిపాల్ ఘన స్వాగతం పలికారు ఈ సందర్భంగా వైద్య కళాశాల అభివృద్ధి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు ప్రజల ఆరోగ్య సమస్యలపై చర్చించారు అనంతరం చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ ప్రిన్సిపాల్ మల్లికార్జున్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో బుగ్రమోని రాములు యాదవ్ వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఆవేదనలో అంబులెన్స్ సిబ్బంది

- పండుగకు కుటుంబం పస్తులు

**టీ మీడియా, మార్చి 13, వనపర్తి బ్యూరో:**
ప్రాణాపాయ పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలను కాపాడేందుకు పగలు--రాత్రి తేడా లేకుండా సేవలందిస్తున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఈరోజు తమ కుటుంబాల పోషణలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతినెల రావాల్సిన జీతాలు సకాలంలో అందకపోవడం వల్ల వారి జీవితం కష్టాల్లో మునిగిపోయింది. ఇప్పటికే అరకొరగా వచ్చే జీతాలు కూడా సమయానికి అందకపోవడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న 108 సిబ్బంది తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాణాలు కాపాడే సేవ చేస్తున్న వారే తమ కుటుంబాలను పోషించలేని పరిస్థితికి చేరుకోవడం బాధాకరం. ప్రతినెల 10వ తేదీ లోపు జీతాలు అందకపోవడం వల్ల ఇంటి అద్దెలు చెల్లించడం, పిల్లల స్కూల్ ఫీజులు ఇవ్వడం, నెలవారీ ఈఎంఐలు తీర్చడం చాలా కష్టంగా మారింది. కొంతమంది సిబ్బంది అయితే రోజువారీ ఖర్చులకు కూడా డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ప్రజల ప్రాణాలను రక్షించేందుకు ఎప్పుడూ ముందుండే 108 సిబ్బంది ఈరోజు తమ సమస్యలతో నిస్సహాయ స్థితిలో ఉన్నారు. కాబట్టి ప్రభుత్వం వెంటనే స్పందించి రావాల్సిన బకాయిలను విడుదల చేసి, ప్రతి నెల నిధులను సకాలంలో విడుదల చేసి జీతాలు సమయానికి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని 108 సిబ్బంది వేడుకుంటున్నారు.




# గ్యాస్ సరఫరాపై అపోహలు నమ్మవద్దు

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు

**టి మీడియా, మార్చి 13,హైదరాబాద్ బ్యూరో :**

అమెరికా--ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో రాష్ట్రంలో ఎల్‌పీజీ గ్యాస్ కొరత ఏర్పడిందని జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గ్యాస్ సరఫరాపై ప్రజల్లో గందరగోళం సృష్టించేలా జరుగుతున్న తప్పుడు ప్రచారాలను అధికార యంత్రాంగం సమర్థవంతంగా తిప్పికొట్టాలని ఆయన ఆదేశించారు. శుక్రవారం ఉదయం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం నుండి సహచర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రలతో కలిసి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎల్‌పీజీ గ్యాస్ సరఫరా పరిస్థితిపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో గృహ వినియోగదారులకు సరిపడా ఎల్‌పీజీ గ్యాస్ అందుబాటులో ఉందని, బాట్లింగ్ ప్లాంట్లలో ఎక్కడా కొరత లేదని తెలిపారు. సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాల వల్లే ప్రజల్లో గందరగోళం నెలకొన్నదని పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో అపోహలకు లోనై అవసరానికి మించి గ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారురాష్ట్రంలో ప్రస్తుతం 810 ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్ల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి 29 లక్షల ఎల్‌పీజీ కనెక్షన్లు ఉండగా, రోజువారీగా సుమారు 2.5 లక్షల సిలిండర్ల సరఫరా జరుగుతోందని వివరించారు. గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రులు, విద్యాసంస్థలు, వృద్ధాశ్రమాలు, ప్రభుత్వ సంస్థలకు ప్రాధాన్యత క్రమంలో గ్యాస్ సరఫరా చేయాలని అధికారులకు సూచించారు.అపోహలను అడ్డుపెట్టుకుని గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ చేయడం, మళ్లించడం, బ్లాక్ మార్కెట్‌కు పాల్పడడం వంటి చర్యలకు ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదని మంత్రి హెచ్చరించారు. ఇప్పటి వరకు ఇటువంటి అక్రమాలపై రాష్ట్రవ్యాప్తంగా 288 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇదే విధంగా కొనసాగితే మరింత కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లకు ఆదేశించారు.రాష్ట్రంలో గ్యాస్ సరఫరా పరిస్థితిని పర్యవేక్షించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో హై లెవల్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. ప్రతి జిల్లాలో కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక అధికారుల కమిటీ ఏర్పాటు చేసి రోజువారీ నిల్వలు, సరఫరా పరిస్థితిని సమీక్షించాలని సూచించారు.పట్టణ ప్రాంతాల్లో 25 రోజులకొకసారి, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకొకసారి గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకోవాలని వినియోగదారులకు సూచించారు. అపోహలు నమ్మకుండా ప్రభుత్వం గ్యాస్ సరఫరా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.






## రూ.119 కోట్లతో..

# తెలుగు కల్చరల్ సెంటర్

- మిషన్ శక్తి పథకం కింద ఆస్పత్రులు
- 28 అంశాల కీ మంత్రివర్గం అమోదం

**టీ మీడియా, మార్చి 13, అమరావతి బ్యూరో:** మంత్రివర్గ సమావేశంలో 28 అంశాలపై చర్చించి ఆమోదించారు. సీఎం అధ్యక్షతన జరిగిన సమావేశంలో అమరావతి అభివృద్ధి, ఉపాధి సృష్టిపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జలవనరులు, వ్యవసాయం, పరిశ్రమలు, పర్యాటకం, విద్యుత్ అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలను ఆయన మీడియాకు వివరించారు.

### కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు భూకేటాయింపు

ఏపీఐఐసీకి చెందిన 75 వేల ఎకరాలను 22ఏ నుంచి తొలగించేలా మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. నీరుకొండలో తెలుగు కల్చరల్ సెంటర్‌కు రూ.119 కోట్లకు పరిపాలనా ఆమోదం లభించింది. 5 ఎకరాల్లో 2 వేలమంది కూర్చునేలా ఆడిటోరియం నిర్మించాలని నిర్ణయించింది. మిషన్ శక్తి పథకం కింద ఆస్పత్రులు నిర్వహించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. తిరుపతి, విజయవాడ, విశాఖలో అప్పీలేట్ కార్యాలయాల ఏర్పాటుకు ఆమోదం నందిగామలో ప్రభుత్వ భూమిని కేంద్రీయ విశ్వవిద్యాలయానికి ఇచ్చేందుకు ఆమోదం లభించింది. నూజివీడులో 7 ఎకరాలు, పలాసలో 5 ఎకరాల భూమి కేంద్రీయ విశ్వవిద్యాలయానికి ఇచ్చేందుకు ఆమోదించింది. గిరిజనులు సాగు చేసే భూములకు వంద శాతం సబ్సిడీతో డ్రిప్, 90 శాతం సబ్సిడీతో స్ప్రింకర్లు ఇచ్చేందుకు ఆమోదించింది.ఆమోదం పొందిన అజెండా అంశాలివే: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ కార్యాలయ నిర్మాణానికి స్థలం, తుళ్లూరు ఎడ్యుకేషనల్ సొసైటీకి 3 ఎకరాల కేటాయింపుపై నిర్ణయం తీసుకుంది. పంచాయతీరాజ్ విభాగంలోని ఏపీఎస్ఐఆర్డీకి 5 ఎకరాల కేటాయింపులు సహా సచివాలయం, హెచ్‌ఓడీ టవర్ల నిర్మాణాలకు పరిపాలనా అనుమతులు ఇచ్చింది. మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనుల కోసం రూ.2,316 కోట్లకు పరిపాలనా అనుమతులిచ్చిన కేబినెట్? రూ.119 కోట్ల వ్యయంతో తెలుగు కల్చరల్ సెంటర్ నిర్మాణానికి ఆమోదం తెలిపింది.

### చిన్న పరిశ్రమలకు ఊతం

సీఆర్డీఏ నిర్ణయాలకు ఆమోదం తెలిపిన రాష్ట్ర మంత్రివర్గం రాజధాని అమరావతిలో వివిధ సంస్థలకు భూకేటాయింపుల ప్రతిపాదనల గురించి సానుకూల నిర్ణయానికి వచ్చాయి. వీటికి మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం తెలిపింది. 300 మంది హెడ్ కానిస్టేబుల్ పోస్టులు, రిజర్వ్? సబ్? ఇన్‌స్పెక్టర్? పోస్టులుగా అప్‌గ్రేడ్ చేసే ప్రతిపాదనకు ఆమోదం లభించింది. చిన్న పరిశ్రమలకు ఊతమిస్తూ దాదాపు 17 వేల మందికి ఉపాధి లభించేలా చర్చలు జరిపింది.

### కేంద్రానికి ప్రతిపాదనలు

3,500 సూక్ష్మ పరిశ్రమలకు రూ.300 కోట్లు కల్పించేలా చర్యలకు మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. ఎఫ్ఆర్ఏ పట్టాదారులకు రాయితీలు కల్పించే ప్రతిపాదనలను ఆమోదించింది. మిషన్ శక్తి కింద 'సఖీ నివాస్' పేరుతో పనిచేసే మహిళల కోసం క్రెచ్ సౌకర్యాలతో హాస్టళు ఏర్పాటుకు కేబినెట్? ఒప్పుకుంది. తిరుపతి, విజయవాడ, విశాఖ అప్పీల్ కార్యాలయాల పరిధిపై ఓ నిర్ణయానికి వచ్చింది. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ చట్ట గెజిట్‌లోకి పోలవరం, మార్కాపురం జిల్లాలు చేర్చే ప్రతిపాదనలను మంత్రి వర్గం ఆమోదించింది. ఈ విషయమై కేంద్రానికి ప్రతిపాదనలు పంపే అజెండాకు ఆమోదం దక్కింది.

జల్ జీవన్ మిషన్ ద్వారా నిధుల మంజూరుకు ఆమోదం తెలిపింది. వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై చర్చించి నిర్ణయం తీసుకుంది. పోలవరం ప్రాజెక్ట్ హెడ్ వర్క్‌లో అదనపు గ్రానైట్ కొనుగోలు, లైనింగ్ పనులకు రూ.23.47 కోట్లు, ప్యాకేజ్-64 పనులకు రూ.24.51 కోట్లు మంజూరుకు అనుమతులు ఇచ్చింది. ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్‌లో అత్యవసర మరమ్మతులకు రూ.255.89 లక్షలు నిధుల మంజూరుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.' -కొలుసు పార్థసారథి, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రిసమావేశానికి రాని మంత్రులు: వివిధ కారణాల వలన ఆరుగురు మంత్రులు మంత్రివర్గ సమావేశానికి రాలేకపోతున్నామని ముందస్తు సమాచారం ఇచ్చారు. తీవ్ర అనారోగ్యం వలన మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనిత, టీజీ భరత్ గైర్హాజరు కాగా భార్య సంవత్సరీకం వల్ల ఫరుఖ్ కేబినెట్?కు రాలేకపోయారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవ ఏర్పాట్ల పర్యవేక్షణ వలన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్ కేబినెట్?కు రాలేదు.

# హైకోర్టు న్యాయమూర్తి

## జస్టిస్ లిసా గిల్ ప్రమాణ స్వీకారం

**టీ మీడియా, మార్చి 13, అమరావతి బ్యూరో :** ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లిసా గిల్ బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టులోని మొదటి కోర్టు హాలులో జరిగిన కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి (జజీ) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆమెతో ప్రమాణం చేయించారు. వ ం జా బ్ - వ ా రి య ా ణా హైకోర్టులో జస్టిస్ లిసా గిల్ సీనియారిటీలో 3వ స్థానంలో కొనసాగుతుండగా, ఆమెను ఏపీ హైకోర్టుకు బదిలీ చేస్తూ రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఇటీవల ఆమోదం ముద్ర వేశారు. హైకోర్టులో జస్టిస్ లిసా గిల్ సీనియారిటీలో 2వ స్థానంలో కొనసాగుతారు.హైకోర్టు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఏప్రిల్ 24న పదవీ విరమణ చేయనున్నారు. ఆ వెంటనే జస్టిస్ లిసా గిల్ హైకోర్టు సీజేగా ఆ స్థానంలో కొనసాగుతారు. ఏపీ హైకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా ఆమె రికార్డు సృష్టించనున్నారు. హైకోర్టులో మొత్తం 37 మంది న్యాయమూర్తుల నియామకానికి ఆమోదం ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 33 ఉంది. తాజాగా జస్టిస్ లిసా గిల్ రాకతో ఆ సంఖ్య 34కు చేరింది.




### హైకోర్టు న్యాయమూర్తి విశేషాలు

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ స్వస్థలం చండీగఢ్. అక్కడి కార్మెల్ కాన్వెంట్ స్కూల్?లో పాఠశాల విద్య అభ్యసించారు. ప్రభుత్వ మహిళా కాలేజీలో హ్యుమానిటీస్?లో డిగ్రీ చదివారు. పంజాబ్ యూనివర్సిటీలో ఎల్?ఎల్?బీ, ఎల్?ఎల్?ఎం పూర్తి చేశారు.జస్టిస్ లిసా గిల్ 1990లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకుని, పంజాబ్?-హరియాణా హైకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. సివిల్, క్రిమినల్, రెవిన్యూ, రాజ్యాంగ పరమైన కేసుల ద్వారా అన్ని రంగాల్లో అనుభవం గడించారు. ఆమె సుదీర్ఘ కాలం పాటు చండీగఢ్?కు పలు కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగ బోర్డులకు ప్రాతినిధ్యం వహించారు. అనంతరం 2014 మార్చి 31న పంజాబ్-హరియాణా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. పంజాబ్-హరియాణా హైకోర్టులో జస్టిస్ లిసా గిల్ సేవలు అందించారు.నియామకం 2 నెలలు ముందుగానే: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో ఇటీవల కొలీజియం సమావేశమైన విషయం తెలిసిందే. ప్రస్తుత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సీజే పదవీకాలం ఏప్రిల్ 24తో ముగుస్తుంది.ఈ నేపథ్యంలో జస్టిస్ లిసా గిల్?ను ఏపీ హైకోర్టుకు న్యాయమూర్తిగా 2 నెలల ముందుగానే బదిలీ చేయాలని నిర్ణయించింది. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి గా ఉన్న జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ బాధ్యతల నుంచి వైదొగిలిన వెంటనే జస్టిస్ లిసా గిల్?ను ఏపీ సీజేగా ప్రతిపాదిస్తూ కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.నూతన సంప్రదాయానికి శ్రీకారం: రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి సుప్రీంకోర్టు కొలీజియం నూతన సంప్రదాయానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుత సీజేల పదవీ విరమణ కాలం ముగియడానికి 2 నెలల ముందే, ఆ స్థానంలోకి కొత్త న్యాయమూర్తి పేరును ప్రతిపాదించాలని నిర్ణయించింది.న్యాయ పరిపాలన వ్యవస్థను బలోపేతం చేసి దాని సామర్థ్యం, నాణ్యతను పెంచేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని కొలీజియం పేర్కొంది. ఈ విధానం వల్ల హైకోర్టు సీజేగా బాధ్యతలు చేపట్టే లోపు ఆ హైకోర్టు వాతావరణానికి అలవాటు పడటానికి వీలవుతుందని పేర్కొంది. దీనిలో భాగంగా జస్టిస్ లిసా గిల్?ను ఏపీ హైకోర్టుకు న్యాయమూర్తిగా తొలుత బదిలీ చేశారు. ప్రస్తుత సీజేగా ధీరజ్ సింగ్ ఠాకూర్ పదవీ విరమణ చేసిన వెంటనే ఆమె ఆ స్థానంలో నియమితులుకానున్నారు.

## కార్యకర్తల కోరిక మేరకు తేది పొడగింపు

- యం.సురేష్ యాదవ్

**టీ మీడియా, మార్చి 13, వనపర్తి బ్యూరో :**

జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వనపర్తి పట్టణ అధ్యక్షుడు యం. సురేష్ యాదవ్ తెలిపారు.జనసేన కార్యకర్తల కోరిక మేరకు తేది మార్చి 17 వరకు పొడగింపు జరిగింది అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం, పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ ప్రారంభించారు.



## ఫ్రై డే డ్రై డే లో బాగంగా పారిశుధ్యం

**టీ మీడియా, మార్చి 13 ,పెబ్బేరు**

"శుక్రవారం పెబ్బేరు పట్టణాన్ని వ్యాధి రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు పట్టణంలోని 4 వార్డులో నిర్వహించిన డ్రై డే కార్యక్రమంలో ఆయన స్వయంగా పాల్గొన్నారు వార్డు పర్యటనలో భాగంగా మున్సిపల్ చైర్మన్ 4వ వార్డు కౌన్సిలర్ దాసరి జమ్ములమ్మ మున్సిపాలిటీ సిబ్బందితో కలిసి పర్యటించారు ఇళ్ల ముందు నిల్వ ఉన్న నీటి కుండీలను పాత టైర్లను పరిశీలించి వాటిలో ఉన్న నీటిని పారబోయించారు కొన్ని చోట్ల డ్రైనేజీలు సరిగ్గా లేకపోవడంపై మున్సిపల్ సిబ్బందికి సూచనలు చేశారు ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ నీటి నిలువ వల్ల దోమలు ప్రబలి డెంగ్యూ మలేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు వారంలో ఒక రోజును డ్రై డేగా పాటించి ఇంట్లోని కూలర్లు పూల కుండీలు ఇతర నీటి నిల్వ పాత్రలను శుభ్రం చేసుకోవాలి అని సూచించారు ఖాళీ ప్లాట్లలో చెత్తాచెదారం వేస్తున్న యజమానులపై చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎండి ఆరిఫ్ కౌన్సిలర్ జమ్మలమ్మ దాసరి పెద్దరాముడు జిల్లా ఐ వై సి సెక్రటరీ శివ కుమార్ కాలనీ వాసులు మహేష్ హరిశంకర్ నరేష్ రెడ్డి మహమ్మద్ మహిళా సంఘం సభ్యులు శ్యామలమ్మ విజయలక్ష్మి అనూష పారిశుధ్య విభాగం అధికారులు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్

**టీ మీడియా, మార్చి 13, వనపర్తి బ్యూరో :**

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వనపర్తి ఎన్ ఎస్ ఎస్ సెల్ ఆధ్వర్యంలో పెద్దగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపులో భాగంగా రెండవరోజు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డి, గ్రామ సర్పంచ్ పుష్పలత శివకుమార్ చే స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. గ్రామంలోని ఆఫీస్ చుట్టూ ప్రక్కల రామాలయ దేవాలయ ప్రాంగణంలోని ప్రాంతాల అన్నింటినీ శుభ్రపరచడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అందరూ పాల్గొన్నారు. భోజనం చేసిన తర్వాత వాలంటీర్స్ అందర్నీ జాతీయ సేవ లో కార్యోన్ముఖులు చేయడానికి విద్యార్థి దశ -సామాజిక సేవ అనే అంశంపై ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ పోతురాజు శ్రీనివాస్, డాక్టర్ జి సుష్మ, వారు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే సామాజిక అంశాలపై, మూఢ విశ్వాసాలు నమ్మకాలపై, బాల్య వివాహాలు వాటి అనార్థాలపై, విద్య దాని ప్రాధాన్యతపై వాలంటీర్స్ కి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ పాల్గొనడం జరిగింది.



## మున్సిపల్ కార్మికురాలిని ప్రభుత్వం ఆదుకోవాలి

- ఎమ్మార్పీఎస్ మాదిగల ఐక్య నాయకుల డిమాండ్

**టీ మీడియా, మార్చి 13, వనపర్తి బ్యూరో :**

వనపర్తి మున్సిపాలిటీకి చెందిన కార్మికురాలు అలివేలు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విషయం తెలిసి మాదిగ కుల పెద్దలు ఆమెను పరామర్శించారు. స్థానిక నాయకుడు పరంజ్యోతి సమాచారం మేరకు వనపర్తిలోని సుధా నర్సింగ్ హోమ్‌లో చికిత్స పొందుతున్న అలివేలును కలిసి ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మోటార్ బైక్ ఢీకొనడంతో అలివేలు రెండు మోచేతి భాగంలో విరిగినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు గంధం నాగరాజు మాదిగ సామాజిక కార్యకర్త, కొమ్ము చెన్నకేశవులు మాదిగ ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ గాయపడిన కార్మికురాలికి ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని, జీతంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని అధికారులను కోరారు. అలాగే స్థానిక మున్సిపల్ చైర్మన్, ఎమ్మెల్యే వెంటనే ఆసుపత్రికి వచ్చి కార్మికురాలిని పరామర్శించి ఆ కుటుంబాన్ని ఆదుకునే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు గంధం పరంజ్యోతి, గంధం నాగరాజు, రాజనగరం రాజేష్, గోపాలపేట నాగరాజు, కొమ్ము యేసోపు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





## చరిత్రలో నిలిచిన తొలి తెలుగు కవయిత్రి

- సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి మాజీ మంత్రి

**టీ మీడియా, మార్చి 13, వనపర్తి బ్యూరో :**

తెలుగు తొలి రచయిత్రి మొల్లమాంబ జయంతి సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి జిల్లా అధికార ప్రతినిధి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన రామాయణ కావ్యాన్ని తెలుగులో రచించిన తొలి కవియిత్రి కుమ్మర. ఆతుకూరి .మొల్లమాంభ అని కొనియాడారు. అకుంఠిత దీక్షతో, మొక్కవోని ఆత్మ విశ్వాసంతో మహిళాలోకానికి స్ఫూర్తిని నింపుతూ తెలుగులో రామాయణం రచించి ఆదర్శంగా నిలిచారు అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు.కుమ్మర జాతికి వెన్నెతెచిన వీరవనిత ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. నివాళులు అర్పించిన వారిలో వాకిటి.శ్రీధర్,పలుస.రమేష్ గౌడ్, నందిమల్ల.అశోక్, సూర్యవంశం. గిరి,చిట్యాల.రాము,సత్యం, రామస్వామి,నరేందర్,వ ఖని కుమార్, శివ, డేగ.మహేశ్వర్ రెడ్డి,జోహెబ్ హుస్సేన్,నాగన్న యాదవ్, శేఖర్,దొడ్ల.రాములు,మహమూద్,గోపాల్ నాయక్, గోవిందు నాయక్, హనుమంతు నాయక్, రమేష్, కర్నాకర్,తోట.శ్రీను,రాము తదితరులు ఉన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ఫ్రైడే ఫ్రైడే

**టీ మీడియా ,మార్చి 13 ,ఆత్మకూరు:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా ఫ్రై డే-- డ్రై డే కార్యక్రమంను ఆత్మకూర్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో నిర్వహించారు ఈ సందర్భంగా గృహాలలో తడి, పొడి చెత్త వేరు చేయడం (వెట్ & డ్రై వేస్ట్ సిగ్రీగేషన్ ) పై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి అక్కడ ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జీ. నాగమణి , వైస్ చైర్‌పర్సన్ ఎం. శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ చికినే శశిధర్, వార్డ్ కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, ఆర్ పి లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



## సీసీ రోడ్లకు 50 లక్షలను మంజూరు చేసిన ఎంపీ

**టి మీడియా ,మార్చ్ 13,ఆత్మకూర్:**

మక్తల్ నియోజకవర్గం లోని ఆత్మకూర్, అమరచింత మండలాలకు ఎంజీ ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా సీసీ రోడ్లు వేయడానికి అడిగిన వెంటనే 50 లక్షల రూపాయలను మంజూరుచేసిన మహబూబ్నగర్ పార్లమెంట్ సభ్యురాలు శ్రీ డీకే అరుణమ్మ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి. ఇట్టి పనులను వీలైనంత త్వరలో పూర్తి చేయించాలని,పూర్తయిన సీసీ రోడ్లకు వెంటనే నిధులు విడుదల చేయాలనీ సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చిన మహబూబ్నగర్ ఎంపీ డీకే అరుణమ్మ సర్పంచ్ ఎన్నికలలో భాగంగా ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ఎంపీ ని మిగతా మండలాలకు కూడా వీలైనంత తొందరలో సీసీ రోడ్లకు నిధులు మంజూరు చేయాలనీ కోరిన రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి.



# ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌పై దాడి

**- గుర్తుపట్టలేని విధంగా మారిన ముజ్తబా:**

**టి మీడియా, మార్చి 13,ఢిల్లీ బ్యూరో :**

ఇరాన్ నూతన సుప్రీం లీడర్ అయతుల్లా ముజ్తబా ఖమేనీపై అమెరికా రక్షణ శాఖ కీలక ప్రకటన చేసింది. తమ దాడిలో ఆయన తీవ్రంగా గాయపడ్డారని వెల్లడించింది. దీంతో ముజ్తబా ఖమేనీ గుర్తుపట్టలేని విధంగా మారారని తెలిపింది. అమెరికాపై ప్రతీకారం తీర్చుకుంటామని ముజ్తబా ఖమేనీ గురువారం తొలిసారి ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆయనపై దాడి చేశామంటూ అమెరికా రక్షణ శాఖ విడుదల చేసిన ప్రకటన ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.



### తికమక పెట్టి, బోల్తా కొట్టించి దాడులు

ఇరాన్‌పై శుక్రవారం కూడా పెద్దసంఖ్యలో వైమానిక దాడులు చేశామని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ తెలిపారు. ఈ ప్రపంచం కనీవినీ ఎరుగని రీతిలో ఇరాన్ సైన్యాన్ని అణచివేస్తున్నామని ఆయన తెలిపారు. ఇరాన్‌పై దాడుల సంఖ్యతో పాటు వాటి కచ్చితత్వాన్నీ పెంచామన్నారు. ఏఐ టెక్నాలజీ, సైబర్ టూల్స్, అంతరిక్ష టెక్నాలజీ వంటి వాటితో ఇరాన్ కళ్లు కప్పి, తికమక పెట్టి, బోల్తా కొట్టించి దాడులు చేస్తున్నామని ఆయన చెప్పారు.

ఇరాన్ చెప్పుకున్న ఆధునిక సైన్యం, తమ దాడుల్లో చాలా వేగంగా డీలా పడిందన్నారు. ఇక ఈ యుద్ధంలో గెలిచేదాకా ఆగేది లేదని పీట్ హెగ్సెత్ స్పష్టం చేశారు. ఈ యుద్ధపు పగ్గాలన్నీ అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ చేతుల్లోనే ఉన్నాయని, దీని వేగం, తీరు, దిశ, టైమింగ్‌ను ఆయనే డిసైడ్ చేస్తారని తేల్చి చెప్పారు.

### ఇరాన్‌లోని 15వేలకుపైగా లక్ష్యాలపై ఎటాక్స్

ఇరాన్ అనేది అమెరికాకు సరిసమాన సైనిక శక్తి కానే కాదని పది రోజుల క్రితం చేసిన ప్రకటననే పీట్ హెగ్సెత్ పునరుద్ఘాటించారు. ప్రపంచంలోనే శక్తివంతమైన అమెరికా, ఇజ్రాయెల్ వాయుసేనలు కలిసి ఫిబ్రవరి 28 నుంచి ఇప్పటివరకు ఇరాన్‌లోని 15వేలకుపైగా లక్ష్యాలపై దాడులు చేశాయన్నారు. ఈ లెక్కన సగటున రోజుకు 1 వెయ్యికిపైగా లక్ష్యాలపై ఎటాక్స్ చేశామని, గతంలో ఇతర దేశాలేవీ ఇంత తక్కువ టైంలో ఇన్ని లక్ష్యాలపై దాడులు చేయలేకపోయాయన్నారు.ప్రస్తుతం ఇరాన్ గగనతలంలో అమెరికా యుద్ధ విమానాలు, బాంబర్ విమానాలు స్వేచ్ఛగా తిరుగుతున్నాయని ఆయన చెప్పారు. తమ యుద్ధ విమానాలు చాలా తీరికగా ఇరాన్‌లోని లక్ష్యాలను గుర్తించి దాడులు చేయగలుగుతున్నాయని పేర్కొన్నారు. ఇరాన్ నుంచి తమకు అందుతున్న నిఘా సమాచారంలోనూ చాలా స్పష్టత ఉందని పీట్ హెగ్సెత్ తెలిపారు. హర్మూజ్ జలసంధిపై ఇరాన్ దాదాగిరీని ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఆ సముద్ర జలమార్గం మీదుగా వాణిజ్య నౌకల రాకపోకలకు, ఇంధన సరఫరాలకు అంతరాయాన్ని తొలగించడంపై ప్రస్తుతం కసరత్తు చేస్తున్నామన్నారు.

### కూలిపోయిన అమెరికా రీఫ్యూయెలింగ్ విమానం

అమెరికా వాయుసేనకు చెందిన రీఫ్యూయెలింగ్ విమానం కేసీ-135 గురువారం రాత్రి ఇరాక్‌లోని పశ్చిమ ప్రాంతంలో కూలిపోయింది. ఈ విమానంలోని నలుగురిని కాపాడామని అమెరికా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ జనరల్ డ్యాన్ కెయిన్ వెల్లడించారు. ఇంకా రెస్క్యూ, రికవరీ ఆపరేషన్ కొనసాగుతోందని ఆయన తెలిపారు. గగన తలంలోనే విమానాల్లోకి ఇంధనాన్ని నింపే కెపాసిటీ కేసీ-135 విమానం సొంతం. దీన్ని బోయింగ్ కంపెనీ తయారుచేసింది.

ఈ విమానం ఎందుకు కూలింది ఎలా కూలింది. అనే అంశంపై ప్రస్తుతం అమెరికా వాయుసేన దర్యాప్తు చేస్తోంది. ఫిబ్రవరి 28 నుంచి ఇప్పటివరకు ఇరాన్‌తో సైనిక ఘర్షణలో నాలుగు విమానాలను అమెరికా కోల్పోయింది. మార్చి నెల ప్రారంభంలో కువైట్‌లో ఉన్న అమెరికా గగనతల రక్షణ వ్యవస్థలు గందరగోళానికి గురయ్యాయి. అవి వదిలిన ఇంటర్ సెప్టర్లు తాకడంతో మూడు ఎఫ్-15 యుద్ధ విమానాలు కూలిపోయాయి.